సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం | 29 | అక్టోబర్ | 2023



సంక్షేమ పథకాలు ఆదర్శం

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు.

- 11లో▸



మాయమాటలు నమ్మి మోసపోవద్దు

నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు.

- 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం $31^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కాళేశ్వరం ఆలయం మూసివేత

చంద్రగ్రహణం నేపథ్యంలో ద్వార బంధనం



కాళేశ్వరం: చంద్రగ్రహణం సందర్భంగా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాలను ఆలయ అధికారులు, అర్చకులు శనివారం ద్వార బంధనం చేసి మూసివేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆలయాలను మూసివేశారు. 29న ఆదివారం యథావిధిగా ఉదయం 4.30గంటలకు ద్వారములు తెరిచి పరిశుభ్రత, సంప్రోక్షణ, ప్రాతఃకాల పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 8గంటల నుంచి భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు చేసుకోవడానికి అవకాశం కల్పించనున్నారని ఈఓ మహేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగ్రహణం రావడంతో గోదావరి హారతి, కోజాగిరి పౌర్ణమి పూజలు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

సింగరేణి జీఎంకు వినతి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రగిరి శంకర్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేయాలన్నారు. మారుపేర్లకు అవకాశం కల్పించాలని చెప్పారు. ప్రైవేటీకరణ నిలిపివేయాలని కోరారు. కార్మికులకు సొంత ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టయ్య, అంకూస్, ఆశోక్, శ్రీనివాస్, శ్యాంబాబు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) భూపాలపల్లి అభ్యర్థిగా అశ్రఫ్



శాయంపేట: బీఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ(యూ) భూపాలపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా ఎండీ అశ్రఫ్ ఉస్మాన్‌ను ఆ పార్టీ ప్రకటించింది. జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్, పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నల్ల సూర్యప్రకాశ్ హైదరాబాద్‌లో ప్రకటించారు. ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి, నాయకులు పెంట తిరుపతి, కూసం బుచ్చయ్య, చిలుకల రాజన్న, కర్ర వెంకట్‌రెడ్డి, మంద భద్రయ్య ఆమెను అభినందించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఆమె గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు.

బీసీ ముఖ్యమంత్రి ప్రకటన హర్షణీయం

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించడం హర్షణీయమని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు శనివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా బీసీ నేతను చేస్తామని ప్రకటించినందుకు ప్రధానమంత్రి మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బీసీలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల రాజయ్య, నాంపల్లి కుమార్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు గట్ల శ్రీనివాస్, చలికాని రమేష్, సంతోష్ పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

- 1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు



- వివరాలు 10లో▸

కొనుగోళ్లకు సిద్ధం

- 15రోజుల్లో వరికోతలు ప్రారంభం
- లక్షా 5వేల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- 189 కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు



భూపాలపల్లి రూరల్: వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది వానాకాలం సీజన్‌లో లక్షా 26వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. ఈ సారి లక్షా 5వేల టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు అంచనా వేశారు. 15 రోజుల్లో వరికోతలు ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 189 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. నాణ్యమైన ధాన్యం గ్రేడ్-ఏ క్వింటాల్‌కు రూ.2203, సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2183 ధర చెల్లించనున్నారు.జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1,10,593 ఎకరాల్లో వరి సాగుచేశారు. సుమారు లక్షా 5వేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉండని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా 189 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఐకేపీనుంచి 8 కేంద్రాలు, పీఏసీఎస్ నుంచి 166, డీసీఎంఎస్ నుంచి 12, జీసీసీ నుంచి 3 కొనుగోలు కేంద్రాలకు అనుమతులు ఇవ్వనున్నారు. అవసరమైతే డిమాండ్ మేర కొనుగోలు కేంద్రాలను పెంచే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

యాసంగిలో ఇబ్బందులు పడ్డ రైతులు..

కాటారం, మహదేవపూర్ మండలాల్లోని రైతులు యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ఇబ్బందులు పడ్డారు. చాలామంది రైతులు నిర్వాహకులను నిలదీశారు. జెడ్పీ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు సైతం అధికారులను నిలదీశారు. రైతులు బహిరంగంగానే కలెక్టర్ భవేష్ మిశ్రాకు ఫిర్యాదుచేశారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి సమస్యలు పరిష్కరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

26 లక్షల గన్నీ సంచులు సిద్ధం..

26 లక్షల గన్నీ సంచులను అధికారులు సిద్ధంగా ఉంచారు. ధాన్యం అంచనాకు మించి ఎక్కువగా వచ్చినట్లయితే గన్నీ సంచులను సరఫరా చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మరో పదిహేను రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నట్లు రైతులు చెబుతున్నారు.

యాసంగిలో ఇబ్బందులు..



కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి. వానలు వస్తే రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. యాసంగిలో ఇబ్బందులు పడ్డాం. ఈ సారి ఇబ్బందులు లేకుండా చూడాలి. ఇబ్బందులు పెట్టని నిర్వాహకులకు కొనుగోలు కేంద్రాలను కేటాయించాలి.

- దావు రఘు, రైతు, టేకుమట్ల

కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

వానాకాలం ధాన్యం సేకరణ కోసం జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరిస్తాం.

- రాఘవేందర్, సివిల్ సప్లయీస్ డీఎం

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



రక్తదానం చేస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే



బైక్ ర్యాలీలో ఎస్పీ కిరణ్ ఖరే

- ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: సమాజంలో శాంతి స్థాపన కోసం, అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం జిల్లాకేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, ఓపెన్ హౌస్, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. పోలీసు అమరవీరుల స్ఫూర్తితో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాలపై ఉందని చెప్పారు. రక్తదాన శిబిరంలో ఎస్పీతో పాటు మరో 150 మంది రక్తదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ(ఏఆర్) వి.శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి, డాక్టర్లు నవీన్, కేఎస్ కిరణ్, శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, యువత పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ..

గణపురం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ కిరణ్ ఖరే శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతి భద్రతల పరిరక్షణపై పలు సలహాలు, సూచనలు అందించారు. చెంచుకాలనీకి వెళ్లి అక్కడి ప్రజలతో ఓటు హక్కు వినియోగంపై మాట్లాడారు. ఆయనతో ఎస్సై మచ్చ సాంబమూర్తి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైస్ ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరిక

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి వైస్ ఎంపీపీ సముద్రాల దీపారాణి-శ్రీనివాస్ దంపతులు, పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెరుమాండ్ల తిరుపతిగౌడ్‌తో పాటు పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సందడి



హేమాచల క్షేత్రంలో హారతి తీసుకుంటున్న భక్తులు



నాగజ్యోతి దంపతులకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న లక్ష్మీనారాయణ, ముకుందం

- హేమాచలక్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి నిరీక్షణ
- బడే నాగజ్యోతి దంపతుల ప్రత్యేక పూజలు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల క్షేత్రంలో స్వయంభువుగా వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం పాక్షిక చంద్రగ్రహణం ఉండడంతో సాయంత్రం 5గంటలకు ఆలయాన్ని మూసివేశారు. ఆదివారం ఉదయం 9గంటలకు సంప్రోక్షణ చేసిన అనంతరం యథావిధిగా భక్తులు దర్శనం చేసుకోవచ్చని అర్చకులు తెలిపారు. చంద్రగ్రహణానికి ముందుగా స్వామివారిని దర్శించుకునేందుకు పలువురు రాజకీయ ప్రముఖులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్త జనంతో కిటకిటలాడింది. భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గంటల కొద్ది వేచి ఉండి మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు భక్తులకు స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని వివరించడాన్ని ఎంతో శ్రద్ధతో ఆలకించి పరవశించారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు ఆలయ అర్చకులు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం ఇచ్చారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్యేక పూజలు

ములుగు నియోజక వర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి దంపతులు లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా రోడ్లు, భవనాల శాఖ చైర్మన్, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల ఎన్నికల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్ ఆయన సతీమణితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వయంభు స్వామివారికి వారి గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టతను, ఆలయ పురాణాన్ని వివరించి స్వామివారు, అమ్మవార్ల శేషవస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల సిబ్బంది శిక్షణ తరగతులకు హాజరు కావాలి
- నడవలేని వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం
- కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రతిజ్ఞ చేపిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. ఓటు హక్కు వినియోగంపై శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ భవేష్‌మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై ఓటరు ప్రతిజ్ఞ చేపించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర దేశాలతో పోల్చితే మన దేశంలో ఓటు హక్కుకు అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమానమైనది ఓటు హక్కు అని తెలిపారు. ఓటు వేయడాన్ని ఒక బాధ్యతగా, గర్వంగా ఫీల్ అవ్వాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 82 శాతం పోలింగ్ నమోదైందని, నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని మరింత పెంచేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ, జిల్లా సంక్షేమశాఖ అధికారి నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది హాజరు కావాలి..

ఈనెల 31న జిల్లాకేంద్రంలో శిక్షణ తరగతులకు ఎన్నికల అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నడవ లేని వారి కోసం..

నడవలేని వ్యక్తులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఫాం 12 డీ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎల్ఓలు ఫాం 12డి అందిస్తారని తెలిపారు. ఫాం అందకపోతే తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో పొందాలని తెలిపారు.

వలస ఆదివాసీలను ఎస్టీలుగా గుర్తించాలి

- మాజీ ఎంపీ మిడియం బాబురావు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబురావు

ఏటూరునాగారం: ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ఆదివాసీలను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించి వారికి అన్ని హక్కులు కల్పించాలని మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు అన్నారు. కొమురం భీం 83వ వర్ధంతి సందర్భంగా శనివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వై జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో కొమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాల తీరు సక్రమంగా లేకపోవడంతో జీవనోపాధి కోసం తెలంగాణ రాష్ట్రానికి కొంత మంది ఆదివాసీలు వలస వచ్చారన్నారు. వారు నివసిస్తున్న ప్రదేశంలో కొంత భూమిని సాగు చేసుకుని వారికి అవసరమైన పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. కానీ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఫారెస్ట్ శాఖ అధికారులు ఆదివాసీ గిరిజనులపై రెచ్చిపోతున్నారన్నారు. అమాయకులైన ఆదివాసీలను ఈ ప్రాంతం నుంచి వెళ్లగొట్టడానికి దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. హైదరాబాద్‌లో శనివారం మంత్రులు భీం విగ్రహానికి పూలమాలవేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఆయన పోరాటాన్ని గాని ఆయన వీరత్వాన్ని గాని చెప్పలేదన్నారు. స్థానిక ఆదివాసీలను వలస ఆదివాసీలను ప్రభుత్వం సమానంగా చూడకుండా వివక్ష చూపడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వలస ఆదివాసులకు అన్ని వసతులతో అన్ని హక్కులు కల్పించాలని బాబురావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిడం లక్ష్మణరావు, తోలెం కిష్టయ్య, బచ్చలి కృష్ణ బాబు, కోరం చిరంజీవి, వీరబాబు, రత్నం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు,

పోరాట వీరుడు కొమురం భీం

ఆదివాసీ చట్టాలు, హక్కుల కోసం నిరంతరం పోరాడిన వీరుడు కొమురం భీం అని ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో కొమురంభీం 83వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహానికి పీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ కొమురం భీంను ఆదివాసీలు గోండు బొబ్బిలిగా పిలుచుకుంటారన్నారు. జల్.. జంగిల్.. జమీన్ నినాదంతో ప్రత్యేక ఆదివాసీల పాలన, సుపరిపాలన కోసం శ్రమించారని ఆయన సేవలను పీఓ కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతీ గిరిజన యువత భీం పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యారంగంలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

- కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

మహదేవపూర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మావోయిస్టులకు ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో గ్రామస్తులతో మాట్లాడారు. మావోయిస్టులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమన్నారు. మావోయిస్టుల కదలికలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామంలోని అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు తెలపాలన్నారు. గ్రామంలో గుడుంబా, మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ కిరణ్, ఎస్సైలు రాజ్‌కుమార్, భవానీసేన్, ప్రసాద్, సురేష్, అభినవ్, లక్ష్మణ్‌రావు, సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారిణి సస్పెన్షన్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారిణి బండారి అనితను సస్పెండ్ చేస్తూ కలెక్టర్, ఎన్నికల అధికారి భవేష్‌మిశ్రా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనవద్దని తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యదర్శి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈనెల 27న బట్టుపల్లిలో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నందున ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

న్యాయ సహాయం అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

భూపాలపల్లి అర్బన్: కొత్తగా నియమింపబడిన పారా లీగల్ వాలంటీర్లు బాధ్యతాయుతంగా పనిచేసి గడపగడపకు న్యాయ సహాయం అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో పారాలీగల్ వాలంటీర్లను నియమించారు. కొత్తగా నియామకం అయిన వారికి శిక్షణ కార్యక్రమం శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణబాబు మాట్లాడుతూ.. గ్రామాల్లో, మండలాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కారం చేసే విషయంలో పారా లీగల్ వాలంటీర్లు ఇటు న్యాయస్థానానికి అటు ప్రజలకు వారధిలా పనిచేయాలని సూచించారు. ప్రజలకు, కుటుంబాలలో ఎటువంటి సమస్య వచ్చినా వాటిని తగ్గించే విధంగా కృషి చేయాలని తెలిపారు. చట్టాల గురించి అవగాహన లేదని.. వారికి అవగాహన కల్పించే పనిని కూడా పారాలీగల్ వాలంటీర్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, న్యాయవాదులు సురేష్‌కుమార్, శ్రవణ్‌రావు, కాశీదాస్, న్యాయసేవాధికార సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

- ప్రజా దీవెనయాత్రలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని 19, 30వార్డుల్లో గండ్ర సత్యనారాయణరావు ప్రజా దీవెన యాత్ర చేపట్టారు. సిరిసిల్ల రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు సన్నబియ్యం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, విద్య, నిరుద్యోగ భృతితో పాటు ఉపాధి కల్పన తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. రెండు సార్లు ఓటమి చవిచూసినప్పటికీ ప్రజల కోసం సేవచేస్తున్న గండ్ర సత్యనారాయణరావుకు ఓట్లువేసి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీ సభ్యుడు చల్లూరి మధు, అర్బన్ అధ్యక్షుడు దేవన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు కురిమిల్ల రజిత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయం మూసివేత

వెంకటాపురం(ఎం): చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం 2గంటలకు రామప్ప ఆలయ గర్భగుడిని అర్చకులు కోమల్లపల్లి హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు మూసివేశారు. ఆదివారం ఉదయం 6గంటలకు ఆలయ గర్భగుడిని తెరిచి సంప్రోక్షణ, అభిషేకం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మార్క సంతోష్, అవినాష్, దామోదర్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

తమ బలాలు, బలహీనతలు నాయకులకు తెలును. మంచినాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచు కుంటాడు.

- వారెన్‌బెన్నీస్



ఈసీ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు



జనగామ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 1950 కాల్ సెంటర్

జనగామ: ఓటర్ల వ్యక్తిగత సమాచారం, పోల్ సంబంధిత ఫిర్యాదులు, ఇతర సమస్యలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎలక్షన్ కమిషన్ టోల్ ఫ్రీ నంబర్–1950 అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్లు, బూత్‌లెవల్ అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సంబంధించిన వివరాలు హెల్ప్ లైన్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఓటు.. వజ్రాయుధం



ఓటు హక్కు వినియోగంపై శనివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.

- హన్మకొండ

ప్రచారంలో 'పరీక్ష'..



బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ శనివారం కాజీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఆర్‌ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా బీపీ పరీక్షించుకున్నారు.

సోషల్ 'వార్'..

తొర్రూరు: ఎన్నికల వేళ టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరిగిపోతోంది. సోషల్ మీడియాలో వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్‌లో పార్టీ ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం ఓటర్లకు విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ఒక పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే అతను ఇష్టం ఉన్నా.. లేకున్నా మొహమాటంతో పోస్టులు చూడలేక, చదవలేక సతమతమవుతున్నాడు. పొరపాటున ఎగ్జిట్ అయితే వారు తమ పార్టీ మనిషి కాదని భావించే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఒకే గ్రూపులోనే పార్టీకి అనుకూలంగా వ్యతిరేకంగా పోస్టులు సెండ్ చేస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఏదీ ఏమైనా ఈ ఎన్నికల సీజన్‌లో వాట్సాప్ లొల్లితో ఓటర్లకు తిప్పలు తప్పడం లేదు.





సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..





సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించాలి

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు కోరారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. తమ పెన్షన్ నుంచి నెలకు ఒక్క శాతం చెల్లిస్తామని, తమకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెష్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలని, గత పీఆర్‌ఎస్, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. చేతనైన సమయంలో జీవితం మొత్తం ఉద్యోగం కోసం వెచ్చించామని, విరమణ చేసి విశ్రాంతి తీసుకున్న తమ సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

- హన్మకొండ

పెన్షనర్ల సంఘానికి భవనం నిర్మించి ఇవ్వాలి



రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో పెన్షనర్లు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోసం స్థలం కేటాయించి, భవనం నిర్మించాలి. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలి. వెల్‌నెస్ సెంటర్లలో సీనియర్ డాక్టర్లను నియమించి మందులు కొరత లేకుండా చూడాలి. ఓపీ రిజిస్ట్రేషన్ సమయంలో నెలకొన్న ఇబ్బందులు తొలగించాలి. అలాగే, ప్రతి ఒకటవ తేదీనే పింఛన్ అందజేసి ఆదుకోవాలి.

- సంజీవరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి

రీయింబర్స్‌మెంట్ రావడం లేదు



హెల్త్ స్కీం అమలుకు నోచుకోకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం డబ్బు చెల్లించాల్సి వస్తోంది. వైద్యం పూర్తయ్యాక రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే సకాలంలో అందక ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బా బేసిక్‌పే నుంచి ఒక్క శాతం కట్ చేసుకుని హెల్త్‌స్కీం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. డీఏ, ఇతర బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి నగదు రూపంలో చెల్లించాలి.

- ఎంఏ జలీల్, రిటైర్డ్ ఉద్యోగి

నగదు రహిత వైద్యం అందడం లేదు



కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బు లేకుండా వైద్య అందడం లేదు. హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేసి మాకు ప్రతి ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

- ఎస్ సోమయ్య, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు

మొదటి తేదీన పెన్షన్ ఇవ్వాలి



కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి నెల 6 నుంచి 15వ తేదీ మధ్యలో పెన్షన్ అందజేస్తున్నారు. అలాకాకుండా ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించి మమ్ములను ఆదుకోవాలి

- ఏ.సత్యనారాయణ, రిటైర్డ్ ఎస్టీఓ, సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

సచివాలయంలోకి అనుమతించడం లేదు



మా సమస్యలు వివరిద్దామని రాష్ట్ర సచివాలయానికి వెళ్తే అనుమతించకుండా సీనియర్ సిటిజన్లను అవమానపరుస్తున్నారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయకుండా ప్రభుత్వాలు మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి ధరలు నియంత్రించి సామాన్యులకు ఊరటనివ్వాలి.

- పగడాల సరళ, రిటైర్డ్ ఉద్యోగి

వెల్‌నెస్ సెంటర్లలో ల్యాబ్ పరీక్షలు చేయాలి



వెల్‌నెస్ సెంటర్లలోని ల్యాబ్‌లో 60 రకాల పరీక్షలు చేస్తామన్నారు. కానీ ఒక్క పరీక్ష కూడా చేయడం లేదు. వ్యాధి తీవ్రత కోసం నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వైద్యులు కూడా ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఉంటారో తెలియడం లేదు. అనుభవం కలిగిన డాక్టర్లతో పాటు మందుల కొరత లేకుండా చూడాలి. ల్యాబ్ పరీక్షలు అన్నింటినీ చేసేలా వసతులు కల్పించాలి.

- కె.రాజశేఖరయ్య, రిటైర్డ్ దేవాదాయశాఖ ఉద్యోగి

ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి



రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయ పన్ను నుంచి మినహాంపు ఇవ్వాలి. ఏటా ఆదాయ పన్ను ప్రతిపాదనలు పంపమనడంతో ఇబ్బందులు పడుతున్నాం. రైలులో ప్రయాణించేందుకు గతంలో రాయితీ ఉండేది. దానిని రద్దు చేశారు. ప్రస్తుతం ఆ రాయితీని పునరుద్ధరించాలి. ఉద్యోగులకు జీతాలతో పాటు పెన్షనర్లకు కూడా నెలలో మొదటి తేదీన పింఛన్ ఇవ్వాలి.

- చందుపట్ల నిరంజన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి

కార్పొరేషన్ ఆవరణలో సబ్‌ట్రెజరీ ఆఫీస్ కొనసాగించాలి



నాలుగు సంవత్సరాల క్రితం వరంగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సబ్ ట్రెజరీ ఆఫీస్ ఉండేది. జిల్లాల విభజన తర్వాత హనుమకొండకు మార్చారు. తద్వారా వరంగల్ జిల్లాలోని సుమారు 7వేల మంది పెన్షనర్లం హనుమకొండకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం.

- మహ్మద్ నిజామొద్దీన్, రిటైర్డ్ ఎంఈఓ, సంఘం వరంగల్ సిటీ అధ్యక్షుడు

పైరవీ చేసిన వారికే పెండింగ్ బిల్లులు



మా బకాయిల గురించి నిత్యం ట్రెజరీ చుట్టు తిరిగినా రావడం లేదు. పైరవీల ద్వారా వెళ్లిన వారికే వస్తున్నాయి. నేరుగా వెళ్తే పని కావడం లేదు. మా సమస్యలు చెప్పుకోవడానికి జిల్లాల వారీగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలి. ప్రతీ జిల్లా కేంద్రంలో పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా ట్రెజరీ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలి.

- మంత్రి సతీష్, రిటైర్డ్ ట్రెజరీ అధికారి

డీఏ, పీఆర్సీ చెల్లించాలి



ఆరు నెలల్లో మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మాకు రావాల్సిన డీఏ, పీఆర్సీని వాయిదాల పద్ధతిలో చెల్లించడం బాధాకరం. మునుపెన్నడూ ఇలా వాయిదాల పద్ధతిలో డీఏలు ఇవ్వలేదు. పెన్షనర్ల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి డీఏ, బీఆర్సీ, బకాయి బిల్లులు ఒకే విడతలో చెల్లించాలి. అప్పుడే మా కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.

- ఇ.శేషయ్య, రిటైర్డ్ ఉద్యోగి

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

- 1952లో ఏర్పడిన నియోజకవర్గ ప్రస్థానం ఇదీ..
- ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ
- 50,079 నుంచి 2,20,886 వరకు పెరిగిన ఓటర్లు
- కీలకంగా మారనున్న మహిళా ఓట్లు





చందూలాల్ సీతక్క



వీరయ్య భోజారావు

ములుగు: ములుగు నియోజకవర్గంలో 1952లో తొలిసారి శాసన సభ ఎన్నికలు జరిగాయి. ఇందులో పీడీఎఫ్(పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్) తరఫున హనుమంతరావు, కాంగ్రెస్ తరఫున రాజ్యలక్ష్మీ పోటీ చేశారు. ఇందులో రాజ్యలక్ష్మికి కేవలం 6,540 ఓట్లు మాత్రమే వచ్చాయి. పీడీఎఫ్ అభ్యర్థి హనుమంతరావుకు 7,132 పోలై ములుగు తొలి ఎమ్మెల్యేగా రికార్డుల్లోకి ఎక్కారు. 1972 వరకు ములుగు జనరల్‌గా ఉంది. ఎస్టీ జనాభా ఎక్కువ ఉండడంతో డీలిమిటేషన్‌లో భాగంగా 1978లో ఎస్టీ రిజర్వ్‌గా మారింది.

ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ

ములుగు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలే ఎక్కువసార్లు గెలుపొందాయి. కాగా టీడీపీ ప్రభుత్వంలో అజ్మీర చందూలాల్, పోరిక జగన్నాయక్ రెండు సార్లు మంత్రులుగా కొనసాగారు. ఇక 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి అజ్మీర చందూలాల్.. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కపై 18,884 ఓట్లతో గెలుపొందారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఏకంగా సిట్టింగ్ మంత్రి చందూలాల్‌పై 22,671 ఓట్లతో గెలుపొందారు.

భారీగా పెరిగిన ఓటర్లు..

1952 మొదలు.. 2023 సంవత్సరం వరకు 71 సంవత్సరాల్లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. 1952తొలి ఎన్నికల్లో 50,076 మంది ఓటర్లు మాత్రమే ఉండగా 1985లో తొలిసారి 1,09,680 మొదటిసారి లక్ష సంఖ్య దాటింది. 1999లో 1,61,863 వరకు వచ్చింది. ఇక 2014లో రెండు లక్షలు దాటింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,20,886 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రభావం చూపనున్న మహిళా ఓటర్లు

2009 నుంచి ములుగు నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సాధారణ ఎన్నికల్లో 1,08,588 మంది పురుషులు, 1,12,277 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించనున్నారు. ఈ లెక్కన నియోజకవర్గంలోని 10 మండలాల్లో (మల్లంపల్లి నూతన) 3,089 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు.



ములుగు నియోజకవర్గ కేంద్రం

2009లో మారిన నియోజకవర్గ ముఖచిత్రం

2009 సాధారణ శాసనసభ ఎన్నికల్లో ఒక్కసారి ములుగు నియోజకవర్గ ముఖచిత్రం పూర్తిగా మారింది. గతంలో నియోజకవర్గంలో ఉన్న గణపురం అలాగే కొనసాగితే ములుగు జనరల్ అయ్యే అవకాశం ఉండేది. అదే విధంగా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలో ఉన్న కొత్తగూడను నర్సంపేట నియోజకవర్గంలో కొనసాగిస్తే నర్సంపేట సైతం ఎస్టీగా కొనసాగేది. అయితే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే పొదెం వీరయ్య అంతర్గతంగా సమావేశమై పరిస్థితిని తారుమారు చేశారు. రిజర్వేషన్లు మారకుండా నల్లబెల్లిని నర్సంపేటలో, కొత్తగూడను ములుగులో, గణపురం(ఎం)ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలిపారు. దీంతో ములుగు ముఖచిత్రం మారి ఎస్టీ రిజర్వ్ అయింది.

నియోజకవర్గంలో పోటీ చేసిన వారి వివరాలు

సంవత్సరం	గెలుపొందిన పార్టీ	అభ్యర్థి	సమీప అభ్యర్థి	పోలైన ఓట్లు
1952	పీడీఎఫ్	హనుమంతరావు	రాజ్యలక్ష్మీ(కాంగ్రెస్)	23,869
1957	పీడీఎఫ్	రాజేశ్వర్‌రావు	కులు(కాంగ్రెస్)	28,865
1962	కాంగ్రెస్	కృష్ణయ్య	ప్రసాద్(సీపీఐ)	39,141
1967	ఇండిపెండెంట్	సంతోశ్ చక్రవర్తి	రామనర్సయ్య(సీపీఎం)	52,379
1972	కాంగ్రెస్	సంతోశ్ చక్రవర్తి	రావు(ఇండిపెండెంట్)	66,755
1978	కాంగ్రెస్	జగన్నాయక్	భోజరావు(జనతా)	64,320
1983	కాంగ్రెస్(ఐ)	జగన్నాయక్	అజ్మీర చందూలాల్(టీడీపీ)	64,474
1985	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	74,599
1989	కాంగ్రెస్	జగన్నాయక్	చందూలాల్(టీడీపీ)	1,02,475
1994	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	1,13,849
1996	టీడీపీ	భోజారావు	జగన్నాయక్(కాంగ్రెస్)	-
1999	కాంగ్రెస్	వీరయ్య	చందూలాల్(టీడీపీ)	1,15,227
2004	కాంగ్రెస్	వీరయ్య	సీతక్క(టీడీపీ)	1,18,383
2009	టీడీపీ	సీతక్క	పొదెం వీరయ్య(కాంగ్రెస్)	1,34,674
2014	బీఆర్ఎస్	చందూలాల్	సీతక్క(టీడీపీ)	-
2018	కాంగ్రెస్	సీతక్క	చందూలాల్(బీఆర్ఎస్)	1,68,780